గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌తో సిఎం భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన సిపి రాధాకష్ణన్‌ను సిఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన ముందుగా గవర్నర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం కాసేపు ఆయనతో ముచ్చటించారు. జార్ఖండ్ గవర్నర్‌గా పని చేస్తున్న సిపి రాధాకృష్ణన్ తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన్ను తాజాగా కేంద్ర ప్రభుత్వం మహారాష్ట్ర గవర్నర్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

31న బాధ్యతలు స్వీకరించనున్న నూతన గవర్నర్

తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమితులైన జిష్ణుదేవ్ వర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. త్రిపురకు చెందిన జిష్ణుదేవ్ వర్మ రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి. 1957 ఆగస్టు 15న జన్మించిన ఆయన 2018-2023 మధ్య త్రిపుర ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు.

ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలి

- సీతారామ ప్రాజెక్టును.. పాత ప్రతిపాదన ప్రకారమే అమలు చేయాలి
- పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా బయ్యారం ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని, పాత ప్రతిపాదన ప్రకారమే సీతారామ ఎత్తిపోతల పథకం అమలు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని కోదండరామయ్య ఫంక్షన్ హాల్‌లో సిపిఎం విస్తృత స్థాయి సమావేశాన్ని నాయకులు గునిగంటి రాజన్న అధ్యక్షతన నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఆశించిన ఫలితాలు రాకుండా చుక్కెదురైందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేసి కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం, పోరాటాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపూర్ణంగా లేదని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో విస్తృతంగా ఉద్యమాలు చేయాల్సి ఉందని అన్నారు.

విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జి నాగయ్య

గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పాత నమూనా ప్రకారం ఇల్లందు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే విధంగా టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద 2016-2-16న నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. కానీ నేటి వరకు ఒక తట్ట కూడా మట్టి తీయలేదని, డిజైన్ మార్చి ఇల్లందు నియోజకవర్గానికి అన్యాయం చేస్తూ సత్తుపల్లి, వైరా ప్రాంతాలకు లబ్ధి చేకూరేలా నిర్మాణం సాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే పాత డిజైన్ ప్రకారమే రోళ్ళపాడు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి ఇల్లందు నియోజకవర్గానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బయ్యారం పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా చేసి, కాలువలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా బంగారంపై తీసుకున్న రుణాలు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సూర్నపాక సోమయ్య, అలవాల వీరయ్య, ఆకుల రాజు, కందునూరి శ్రీనివాస్, మండా రాజన్న, మండల కార్యదర్శి నంబూరి మధు తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న రేవంత్

విద్యుత్ కమిషన్ ముందు కెసిఆర్ ఎందుకు హాజరుకాలేదు..?

- జైపాల్ రెడ్డి చొరవతోనే తెలంగాణకు వెలుగులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్తు ఒప్పందాల్లో అక్రమాలు జరగలేదని ఊదరగొడుతున్న కెసిఆర్..విద్యుత్ కమిషన్ ఎదుట ఎందుకు హాజరుకాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణాల్లో తీవ్ర స్థాయిలో అవినీతి జరిగిందనీ అందుకే విచారణ అంటే భయపడుతున్నారని అన్నారు. విద్యుత్ రంగానికి బడ్జెట్ కేటాయింపులపై సోమవారం శాసనసభలో చర్చ జరిగింది. బిఆర్ఎస్ సభ్యులు జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ రంగ అభివృద్ధికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో చేసిందని వివరించారు. దీనిపై సిఎం స్పందిస్తూ, విద్యుత్ అంశంలో న్యాయ విచారణ కోరిందే బిఆర్ఎస్ సభ్యులు అని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. "జగదీశ్‌రెడ్డి ఆవేదన చూస్తుంటే చర్లపల్లి జైలులో ఉన్నట్లు మాట్లాడుతున్నారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు, యాదాద్రి పవర్‌ప్లాంట్‌పై న్యాయ విచారణ జరుగుతోంది. విచారణ కమిషన్ ముందు వాదనలు వినిపిస్తే బిఆర్ఎస్ సభ్యుల నిజాయతీ బయటకు వస్తుంది. న్యాయ విచారణ కోరింది వాళ్లే.. వద్దంటున్నది వాళ్లే. విద్యుత్ కమిషన్ ఎదుట కెసిఆర్ ఎందుకు హాజరు కాలేదు? విచారణ కమిషన్ కొత్త ఛైర్మన్‌ను సాయంత్రం నియమిస్తాం. విద్యుత్ కోతలు ఉండకూడదని గతంలోనే రాజశేఖర్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. యుపిఎ ప్రభుత్వ నిర్ణయాల వల్లే హైదరాబాద్‌కు ఆదాయం పెరిగింది. విభజన చట్టం ప్రకారం విద్యుత్ ఉత్పత్తి ఆధారంగా రెండు రాష్ట్రాలకు విభజన చేయాలి. అలాజరిగితే తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని అప్పటి కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి... ప్రధాని మన్మోహన్ సింగ్, యుపిఎ అధ్యక్షులు సోనియాగాంధీని కలిసి విద్యుత్ వినియోగం ఆధారంగా విభజన చేయాలని స్పీకింగ్ ఆర్డర్ ఇప్పించారు. జైపాల్‌రెడ్డి కృషి వల్ల వినియోగం ఆధారంగా తెలంగాణకు 54 శాతం వచ్చేలా విద్యుత్ విభజన జరిగింది. తెలంగాణను చీకట్ల నుంచి కాపాడింది జైపాల్‌రెడ్డి" అని సిఎం వెల్లడించారు.

విద్యుత్‌పై విచారణ కొనసాగించాలని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. యాదాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని సిఎం తెలిపారు. పనులను ప్రభుత్వరంగ సంస్థ బిహెచ్ఇఎల్‌కి ఇచ్చి..అక్కడ నుంచి సివిల్ వర్క్స్ అన్నీ బిఆర్ఎస్ నేతల బినామీలకే ఇచ్చారు. రూ.వేల కోట్ల విలువైన పనుల్లో అవినీతి జరిగింది. విచారణలో వీళ్ల అవినీతి బయటకు వస్తుందనే అడ్డుకుంటున్నారు. న్యాయవిచారణ జరుగుతున్నప్పుడే దొరికిపోయారనే విషయం బిఆర్ఎస్ నేతలకు అర్థమైంది. జైలుకు వెళ్లాల్సి వస్తుందనే కమిషన్‌కు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లారు. భద్రాద్రి పవర్‌ప్లాంట్‌ను రెండేళ్లలో పూర్తి చేస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఆ ప్రాజెక్టుకు ఏడేళ్లు పట్టింది. యాదాద్రి పవర్ ప్రాజెక్టు 2021 లోపు పూర్తి చేస్తామని ఒప్పందం చేసుకున్నారు.. ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్లాంట్ పూర్తికి మరో రెండేళ్లు పడుతుంది. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెక్టుల్లో అవినీతి తేల్చడానికే విచారణ కమిషన్ వేశాం. గతంలో నన్ను జైలుకు పంపించినా భయపడలేదు. నిలబడి కొట్లాడాను. వాళ్ల అబద్ధాలు చెప్పడం మానకపోతే.. నేను నిజాలు చెప్పడం మానను" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

చివరి ఆయకట్టు వరకూ నీరందిస్తాం

- సిఎంపై హరీశ్‌రావు వ్యాఖ్యలు సరికాదు
- త్వరలో 'ఇరిగేషన్' అవినీతిని బయటపెడతాం
- ఒక్క ఇంటికీ చేరని కాళేశ్వరం నీరు
- పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టించిన కెసిఆర్
- పవర్ ప్రాజెక్టుల పేరుతో రూ.వేల కోట్లు దుర్వినియోగం
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చివరి ఆయకట్టు వరకూ సాగు నీరిచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిది అని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరామారావు అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మాట్లాడారు. మిడ్ మానేరుకు నీరు వస్తుందని, రైతుల పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు ప్రమాదాన్ని ఎన్‌డిఎస్ఎ ముందుగానే హెచ్చరించినా వినకుండా పనులు చేపట్టారన్నారు. నేడు అదే మేడిగడ్డ పగుళ్లకు కాంగ్రెస్ కారణమని బిఆర్ఎస్ నాయకులు సోయి లేకుండా మాట్లాడుతున్నారని, ఇది ప్రజలను డైవర్ట్ చేసి ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డ్యాములకు మూడేండ్లకే పగుళ్లు వస్తున్నాయంటే సిగ్గు పడాలన్నారు. కెసిఆర్, కెటిఆర్‌లాగా తమ పార్టీలో ఇంజనీర్లు లేరన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులకు పర్రెలు పారినా ఏ ప్రతిపక్ష నాయకుడూ, మీడియా అక్కడికి వెళ్లకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం పోలీస్ ఫోర్సుతో బందోబస్తు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారగానే కెటిఆర్ సహా, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిక్నిక్‌కు వెళ్లి వచ్చినట్టుగా పగుళ్లను పరిశీలించి వస్తున్నారని విమర్శించారు. మిడ్‌మానేరుకు ఒక్క టిఎంసి, ఎల్లంపల్లికి ప్రతి ఏడాదీ 70 టిఎంసిల నీరు వచ్చి చేరుతుందన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తామని కేంద్రంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డిపై సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యలు సరికాదన్నారు.

అబద్ధాలకు కేరాఫ్ హరీశ్‌రావు : ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

బిఆర్ఎస్ వారు చేసిన దోపిడీ కప్పిపుచ్చుకోవడానికి సిఎం రేవంత్‌రెడ్డిపై అబాండాలు వేస్తున్నారని, అబద్ధాలకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కేరాఫ్ అడ్రస్సు అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిట్‌చాట్‌లో హరీశ్‌రావు ఏది పడితే అది మాట్లాడుతున్నారని, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, సిఎం రేవంత్‌రెడ్డి రిలేషన్‌షిప్ గురించి మాట్లాడే అర్హత బిఆర్ఎస్ వారికి లేదన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో జైపాల్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమాయకులు బలిదానాలు చేసుకున్నారు కానీ, కెసిఆర్ కుటుంబంలో ఒక్కరూ ఆ సాహసం చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యుత్‌పై చేసిన వేల కోట్ల అవినీతిని సిఎం రేవంత్‌రెడ్డి అంకెలతో సహా చెప్పారని, త్వరలో ఇరిగేషన్‌లో జరిగిన అవినీతి లెక్కలనూ బయటపెడుతామని అన్నారు.

మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల వల్లే తెలంగాణకు నీరు
ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే తెలంగాణ ప్రజలకు నీరందుతున్నదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు నీరందించడమే సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం అన్నారు. భూపాలపల్లి జిల్లాలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ఒక్క ఇంటికీ నీళ్లు రాని దౌర్భాగ్య స్థితి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ వారి అడుగులకు మడుగులొత్తె ప్రభాకర్‌రావును ట్రాన్స్‌కోకు సిఎండిగా నియమించి దోపిడీ చేశారన్నారు. ఇంకా మాటల గారడీతో రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టలేరన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం
ఎమ్మెల్యే నాగరాజు

గడిచిన పదేండ్లలో పోలీసు వ్యవస్థను బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో టాస్క్‌ఫోర్స్, ఎస్ఓటీ సహాయంతో పోలీసు వ్యవస్థను గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి అధికారులను బదిలీ చేయలేదన్నారు. పోలీసు వ్యవస్థ ఎప్పుడూ ప్రజల సంరక్షణకు పాటుపడుతుందన్నారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా సభలో మాట్లాడటం సరికాదన్నారు. గతంలో అక్బరుద్దీన్‌పై దుండగులు కాల్పులు జరిపితే ఆయనను కాపాడింది పోలీసులే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అక్బరుద్దీన్ పోలీసు వ్యవస్థకు సూచనలు, సలహాలు ఇవ్వాలి కానీ, దుమ్మెత్తిపోయొద్దు అని హితవు పలికారు. పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీయొద్దన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పోలీస్ స్టేషన్లను ఎటిఎంలుగా వాడుకుంటే, తమ ప్రభుత్వం పోలీసు అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. తెలంగాణ పోలీసులు దేశానికే దిక్సూచి అన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే నల్లగొండలో కులదురహంకార హత్య, అడ్వకేట్ దంపతుల హత్య, డాక్టర్‌పై లైంగికదాడి లాంటి ఘటనలు చాలా జరిగాయన్నారు.

పంచాయతీ ఎన్నికలపై సర్కార్ ఫోకస్

- కలెక్టర్లకు సిఎస్ కీలక ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికలను వీలైనంత తొందరగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సన్నాహాలు చేస్తోంది. సర్కార్ సూచనల మేరకు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు వేగం పెంచారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు తగిన చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే ఆగస్టు 2, 3 తేదీల్లో ప్రతి జిల్లా నుంచి ఐదుగురికి ఎన్నికల నిర్వహణపై ఇసి శిక్షణ ఇవ్వనుంది. ఈ ఏడాది జనవరిలో గ్రామ పంచాయతీల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. పార్లమెంట్ ఎన్నికలు, బిసి రిజర్వేషన్లపై క్లారిటీ లేకపోవడంతో ప్రభుత్వం వాటి ఎన్నికలు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనే నడుస్తోంది. దీంతో వీలైనంత తొందరగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. పాత బిసి రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారా? రాష్ట్రంలోని బిసి ఓటర్లను లెక్కించి కమిషన్ ఇచ్చే నివేదికగా ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తారా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. వివిధ వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేక పోతున్నదని సమాచారం.

గిరిజన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ గిరిజన సంఘం (టిజిఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల తొమ్మిది నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా గిరిజన హక్కుల దినోత్సవాలు జరపనున్నట్టు తెలిపారు. ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం ఆగస్టు 9న ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని గుర్తు చేశారు. ఆదివాసి గిరిజన తెగల హక్కులను రక్షించడం, స్వయంపాలన, జీవన విధానం, సంస్కృతి, ఆచార వ్యవహారాలను గౌరవించడం, గిరిజనుల అభివృద్ధి, భాషల గుర్తింపు, విద్య, ఆరోగ్యం వంటి లక్ష్యాలను సాధించే దిశగా పాలక ప్రభుత్వాలు కృషిచేయాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందని తెలిపారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే రాజ్యాంగంలోని గిరిజనుల హక్కులు, చట్టాలను కాలరాస్తోందని విమర్శించారు

మధ్యాహ్న భోజన పథకాన్ని 'హరేరామ'కు ఇవ్వొద్దు

- సిఎం రేవంత్‌రెడ్డికి సిఐటియు లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) కోరింది. ఈ మేరకు లేఖను మెయిల్ ద్వారా సోమవారం సిఎం రేవంత్‌రెడ్డికి ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.స్వప్న, ఎస్‌వి.రమ పంపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 27న ఆ ఫౌండేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపి వారికి భోజన నిర్వహణను ఇచ్చే ప్రతిపాదనలు చేశారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ప్రతిపాదన వల్ల రాష్ట్రంలోని 54,202 మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని కోరారు. అరకొర గౌరవవేతనం ఇస్తున్నా..సకాలంలో బిల్లులు రాకున్నా అప్పులు చేసి మరీ పిల్లలకు నాణ్యమైన, వేడివేడి ఆహారాన్ని వండి పెడుతున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛంధ సంస్థలకు ఇచ్చిన దగ్గర భోజన నిర్వహణ అధ్వానంగా ఉందని గతంలో కాగ్ నివేదిక రిపోర్టు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే బిల్లులను వెంటనే విడుదల చేయాలనీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు.

'మానుకోట'లో వికసించని 'విద్య'

- అక్రమ నియామకాలు, డిప్యుటేషన్ల రగడ
- వివాదాస్పదంగా డిఇఒ పనితీరు
- పోరాటాలకు ఉపాధ్యాయ సంఘాలు సిద్ధం
- ఆగస్టు 3న టిఎస్ యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని రంగాల్లో వెనుకబడిన మహబూబాబాద్ జిల్లాలో విద్యారంగం పనితీరు, ఆ శాఖ అధికారుల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. గిరిజనులు అత్యధికంగా ఉండి అక్షరశాతం తక్కువ ఉన్న మహబూబాబాద్ జిల్లాను అగ్రస్థానంలో నిలపడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన పదోన్నతులు, బదిలీల్లో, డిసిఇబి నియామకాల్లో, అక్రమ డిప్యుటేషన్ వ్యవహారంలో, ప్రయివేట్ పాఠశాలల నిర్వహణలో, పుస్తకాల అమ్మకాల్లో.. ఇలా ప్రతి విషయంలో.. డిఇఒ పనితీరుపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు సైతం విమర్శలు గుప్పిస్తున్నాయి.

మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా 18 మండలాలు ఉండగా ఒక్క పూర్తిస్థాయి ఎంఈఓ కూడా లేడు. ముగ్గురు ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి ఎంఈఓలుగా కొనసాగుతున్నారు. ఇందులో పూల్ చందు.. ఏడు మండలాలకు, శ్రీదేవి.. ఐదు మండలాలకు, గుగులోతు రాము.. ఆరు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓలుగా కొనసాగుతున్నారు. వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులను అక్రమంగా డిఇఒ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై నియమించడం వివాదాస్పదంగా మారుతోంది. ఇటీవల నియమించిన డిసిఇబి కమిటీల్లోనూ అవకతవకలు జరిగినట్టు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. కేసముద్రం మండలం బెరువాడ గ్రామంలో యుపిఎస్ పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడుని డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి డిఇఒ కార్యాలయంలో నియమించడం కూడా వివాదస్పదం అయింది. ఇలా నియమించడం పూర్తి విరుద్ధమని ఉపాధ్యాయులు అంటున్నారు. ఆయన డిప్యుటేషన్ రద్దు చేసి పాఠశాలకు పంపించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయినా డిఇఒ పట్టించుకోకుండా ఆయనకే డిసిఇబి బాధ్యతలు అప్పగించడం గమనార్హం. అంతేకాదు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రయివేటు పాఠశాలలను కట్టడి చేయడంలోనూ డిఇఒ వైఫల్యం చెందారని, అక్రమంగా పుస్తకాల అమ్ముతున్నట్టు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

జిల్లాలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించే వార్షిక పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజులు సుమారు రూ.25 లక్షల వరకు ఉంటాయని అంచనా. ఈ డబ్బులను డిసిఇబి ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులు విద్యార్థులకు పరీక్ష పత్రాలు తయారుచేసి ముద్రించి పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ ఆర్థిక వ్యవహారాన్ని తన కంట్రోల్లో ఉంచుకోవడం కోసమే డీఈవో తనకు అనుకూలమైన వ్యక్తిని డిసిఇబి కమిటీలో నియమించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా ఈ కమిటీలో ఒక కార్యదర్శి, ఒక అసిస్టెంట్ కార్యదర్శితో పాటు ఆరుగురు ప్రధానోపాధ్యాయులు ఉండాలి. పిజిహెచ్‌ఎంను సెక్రటరీగా నియమించాల్సి ఉంటుంది. అసిస్టెంట్ సెక్రటరీగా ఎస్‌జిటిని లేదా స్కూల్ అసిస్టెంట్‌ను నియమించాల్సి ఉంటుంది. అసిస్టెంట్ సెక్రటరీ నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత నోటిఫికేషన్ జారీ చేసి ఆ తర్వాత నియామకం చేపట్టాలి. కానీ, అవేమీ పట్టించుకోకుండా డీఈవో తనకు నచ్చిన వారిని ఎంపిక చేసుకున్నట్టు ఆరోపణలొస్తున్నాయి.

ఎంఈఓలు లేక కొరవడిన పర్యవేక్షణ

జిల్లాలో పూర్తిస్థాయి ఎంఇఓలు లేకపోవడంతో ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల పర్యవేక్షణ సరిగ్గా జరగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి రైలు, బస్సులపై ఆధారపడి రాకపోకలు సాగిస్తున్న ఉపాధ్యాయులు.. సమయపాలన పాటించడం లేదని సమాచారం. ఈ పరిస్థితిని మార్చాలంటే నిరంతరం పర్యవేక్షణ ఉండాలి. ఎంఈఓలు ప్రతిరోజూ పాఠశాలను తనిఖీలు చేయాలి. కానీ పూర్తిస్థాయి ఎంఈఓలు లేకపోవడంతో పర్యవేక్షణ లేకుండా పోతోంది. కాగా జిల్లాలో ఎంఈవోలుగా బాధ్యతలు వహిస్తున్న ప్రధానోపాధ్యాయులూ బదిలీ అయ్యారు. ఎంఈఓ పూల్ చందు ఖమ్మం జిల్లాకు, ఎంఈఓ శ్రీదేవి, గుగులోత్ రాము.. ఇద్దరూ వరంగల్ జిల్లాకు పదోన్నతుల్లో బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం వారు అక్కడ ఉపాధ్యాయులుగా, మహబూబాబాద్ జిల్లాలో ఎంఈఓలుగా కొనసాగుతున్నారు. వారు బదిలీ అయినా కొత్తగా ఎంఈఓలకు ఇన్‌చార్జి ఇవ్వలేదు. ఒక్కొక్క మండలానికి ఒక్కరోజు కూడా సమయం కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో పాఠశాల నిర్వహణ బాధ్యతలు ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. కరోనా కంటే ముందు ఉపాధ్యాయులకు పాఠశాలలో బయోమెట్రిక్ అమలు చేశారు. కరోనా సమయంలో బయోమెట్రిక్ తొలగించగా.. ఇప్పటివరకు దాన్ని పునరుద్ధరించలేదు. అంతేకాక ఉపాధ్యాయులు తరగతి గదిలో సెల్‌ఫోన్ ఉపయోగించొద్దనే నిబంధనా అమలు కావడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. అలాగే ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో ఎస్సీ మహిళా ఉపాధ్యాయులకు రావాల్సిన రోస్టర్ పాయింట్లను పాటించకపోవడంతో ఎనిమిది మంది మహిళా ఉపాధ్యాయులు పదోన్నతులు కోల్పోయారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోరాటం చేసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం వారికి పదోన్నతి లభించింది. డిఇఒ పర్యవేక్షణలో జరగాల్సిన పదోన్నతుల నియామకాల్లో అవకతవకలు జరిగి ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురయ్యారు. ఇలా అనేక రంగాల్లో డీఈవో వైఫల్యం కనిపిస్తుంది. వీటిన్నింటిపై టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం డీఈఓకు నోటీసు కూడా ఇచ్చింది. జిల్లా కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆగస్టు 3న 3న డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నారు. డిప్యూటేషన్ రద్దు చేయకపోతే భవిష్యత్తు కార్యాచరణ ఇంకా తీవ్రంగా ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

డిఇవోను విధులనుంచి తొలగించాలి -టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ

విద్యాశాఖలో కేంద్ర బిందువైన డిఇఒను విధుల నుంచి తొలగించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 3న ధర్నా చేయనున్నాం. స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల ప్రక్రియ పూర్తయిన తర్వాత అవసరం ఉన్న చోట ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి. జిల్లాలో ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖ అధికారుల పోస్టులు భర్తీ చేయాలి. జిల్లా విద్యాకార్యాలయంలో కొనసాగుతున్న డిప్యూటేషన్ రద్దు చేయాలి. ప్రమోషన్ బదిలీల్లో జరిగిన తప్పులను సరిదిద్ది బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

కూటమి బచావో బడ్జెట్

- కేంద్ర బడ్జెట్‌లో మహిళలను విస్మరించారు
- ఐద్వా జాతీయ నాయకురాలు టి జ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ మహిళల్ని విస్మరించారని, అది బేటీ బచావో బడ్జెట్ కాదు.. కూటమి బచావో బడ్జెట్ అని ఐద్వా జాతీయ నాయకులు టి జ్యోతి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నాలుగు రోజులు జరిగిన ఐద్వా రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో టి జ్యోతి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ.. తన ఎన్‌డిఎ కూటమి కుర్చీ బచావో అనే విధంగా అనుయాయులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించుకున్నారని విమర్శించారు. మహిళల అభ్యున్నతికి, ఉద్యోగ కల్పనకు, కుటీర పరిశ్రమలకు నిధులు కేటాయించలేదన్నారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, వేధింపులు, అఘాయిత్యాలు ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై వేధింపులు అధికంగా ఉన్నాయని, ఒక పక్క బేటీ బచావో అంటున్న ప్రధాని మోడీ.. మణిపూర్ ఘటనలో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగింపు చేసినా ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. దేశానికి బంగారు పతకాలు అందించిన మహిళా రెజ్లర్లను బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ సింగ్ లైంగికంగా వేధించారని, వారు పోరాటం చేసినా సదరు ఎంపిపై మోడీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హత్రాస్, కథువా, ఉన్నావ్ లాంటి ఘటనల్లో దుండగులకు బిజెపి నాయకులే కొమ్ము కాసేలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో గృహలక్ష్మి, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మహిళా గ్రూపులకు రూ.20లక్షలు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అర్హత ఉన్న వారికి రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని అన్నారు. వెంటనే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేసిన ప్రతినిధులకు, ప్రజానీకానికి, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు.

IN THE COURT OF III ADDL. CITY CIVIL AND SESSIONS JUDGE, AT BANGALORE
Ex. Case No.775/2024 IN O.S. No. 1455/2019 (CCH-25)

DECREE HOLDER: SRI. K. SRINIVASA RAJU, S/o K. Sathyanarayana Raju, aged about 49 years, R/at No.2D, Sneha Apartments, North NCL, Kompally, Qutubullapur, Hyderabad- 500 014, Telangana State.

Presently at No.401E, NCI Sindhu, Qutubullapur, Medchal, Malkajgiri District, Hyderabad- 500 007, Telangana State. Also, at: Municipal New No.346, Having PID No.57-191-346, 2nd Floor, 16th Cross, 5th Phase, J.P. Nagar, Ward No. 17, Bengaluru **-V/s-**

JUDGMENT DEBTOR: Suresh Arun

NOTICE TO THE JUDGEMENT DEBTOR UNDER ORDER V RULE 20 OF CPC.

JUDGEMENT DEBTOR: SRI. SURESH ARUN, S/o Arun Arumugam, R/at No. 59A, Beulah, Teachers Colony, Gunrock Village, Trimulgherry, Secunderabad, Telangana, Pin-500013. Also at: R/at Plot No.120, Gunrock Enclave Transport Road, Near Diamond Point, Karkhana, Secunderabad, Telangana- 500 009.

WHEREAS, DHR K. Srinivasa Raju has filed a petition under Order 21 Rule 11 of CPC, in Ex.775/2024 on file of the Hon'ble III Addl. City Civil & Sessions Judge, Bangaluru (CCH-25), for the relief of the Judgement and Decree in OS.No.1455/2019 (Judgement Debtor), in respect of the Schedule property hereunder and you are hereby directed to appear in person or through an advocate at **11 O'** clock on **30-08-2024,** failing which the case will be heard and decided in your absence.

SCHEDULE

All that piece and parcel of the residential house property bearing No.346, situated at 5th Phase, J.P. Nagar, formed by the Bengaluru Development Authority, Bengaluru, presently bearing Municipal New No.346, 16th Cross, 5th Phase, J.P. Nagar, Ward No.57, BBMP Bengaluru, having PID No.57-191-346, measuring East to West 9.15 Meters and North to South: 12.20 Meters, in total measuring 111.63 Square Meters and bounded as follows: **East by:** Site No.345, **West by:** Site No.347, **North by:** Site No.290, **South by:** Road, Together with building 65.78 Square Meters in Ground Floor and 65.78 Square Meters in First floor and 35 Square Meters in Second Floor of RCC roofed house constructed therein having marble flooring, doors and windows are made up of teak wood, with all civic amenities, water electricity and sanitary facilities.

Given under my hand and seal of the court, this the 24-07-2024

By Order of the Court, Senior Sheristedar, City Civil Court, Bengaluru

CHALAPATHI .R, Advocate
No.4, Corporation Market Building, Cubbonpet Main Road, Bengaluru- 560 002. Ph: 9845543762.

సిఎం రేవంత్‌ను కలిసిన రైల్వే సిఇ సుబ్రమణ్యన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైల్వేశాఖ చీఫ్ ఇంజినీర్ సుబ్రమణ్యన్ సోమవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ రూట్ మ్యాప్‌ను సిఎంకు ఆయన వివరించారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి ఈ సందర్భంగా రేవంత్ ఆయనకు పలు సూచనలు చేశారు. రూ.3,500 కోట్లతో నిర్మిస్తున్న145కి.మీ నిడివి గల ఈ రైల్వేలైన్ పూర్తయితే వికారాబాద్, పరిగి, కొడంగల్, నారాయణపేట్, మక్తల్ ప్రాంతాలకు రవాణా పరంగా ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ భేటీలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, వాకాటి శ్రీహరి, పర్ణిక రెడ్డితో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌సిపిలో 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటి ప్రవాహం పెరిగింది. దాంతో ఎస్ఆర్‌సిపి ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ప్రాజెక్టులోకి 17వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతున్నట్టు అధికారులు సోమవారం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5టిఎంసి) అడుగులు కాగా.. ప్రస్తుతం 1075.6 అడుగుల (34.097 టిఎంసి)నీరు నిల్వ ఉంది. 644 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో.. అందులో సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఎవపోరేషన్ 403 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్టు అధికారులు తెలిపారు. కాగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు స్వలంగా 460 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.777 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

సింగరేణిపైనా విచారణ జరపాలి : కూనంనేని

ప్రజాశక్తి బ్యూరో-హైదరాబాద్

విద్యుత్‌పై వేసిన విచారణ కమిషన్‌లో సింగరేణిని కూడా చేర్చాలంటూ తాను గతంలోనే చెప్పానని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గుర్తు చేశారు. సోమవారం శాసన సభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్‌ను, సింగరేణిని కలిపి చూడాలన్నారు. సబ్‌క్రిటికల్, సూపర్ క్రిటికల్ పద్ధతుల్లో చాలా తేడా ఉందన్నారు. ఇందుకు సంబంధించి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పింది ఏమీ అర్థం కాలేదన్నారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కార్మికులు చాలా అన్యాయమైన జీవితాలు గడుపుతున్నారన్నారు.అర్టిజన్ కార్మికులు సుమారు 22 వేల మంది ఉన్నారని చెప్పారు. జీతాలు పెంచండి అన్నందుకు గత ప్రభుత్వం 13 మందిని సస్పెండ్ చేసిందని చెప్పారు. వందల మందిని బదిలీ చేసిందని తెలిపారు. పదేండ్లు ఒకే వ్యక్తి సింగరేణికి సిఎండిగా ఉండడం వల్ల నష్టం జరిగిందన్నారు. దీని వెనుక ప్రభుత్వ ప్రమేయం ఉందని చెప్పారు.

సాగర్ కేసి కృష్ణమ్మ పరుగులు

- 'శ్రీశైలం' మూడు గేట్లు ఎత్తివేత
- ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్
- ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి
- జూరాల 46 గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణానది పరివాహక ప్రాంత ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి. ఆల్మట్టి డ్యాం నుంచి భారీగా జూరాలకు వరద చేరడంతో ప్రాజెక్టు 46 గేట్లు తెరుచుకోగా.. అక్కడి నుంచి శ్రీశైలానికి వరద పోటెత్తింది. దీంతో శ్రీశైలం మూడు గేట్లు ఎత్తి దిగువన సాగర్‌కు నీటిని వదిలారు. కృష్ణమ్మ సాగర్‌కు పరుగులు పెడుతూ ప్రవహిస్తోంది. శ్రీశైలం గేట్లు ఎత్తడంతో సందర్శకుల తాకిడి పెరిగి ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యి వాహనాలు నిలిచిపోయాయి. వాస్తవానికి మంగళవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తుతారని ప్రచారం జరిగింది. కానీ ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో సోమవారమే అధికారులు గేట్లను ఎత్తారు.

జూరాలకు 46 గేట్ల నుంచి దిగువకు

ప్రియదర్శని జూరాల ప్రాజెక్టులోకి ఆల్మట్టి, నారాయణ పూర్ డ్యాముల నుంచి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో 3.18 లక్షల క్యూసెక్కులు నీరు వస్తోంది. దీంతో జూరాల ప్రాజెక్టులో 46గేట్లు ఎత్తి శ్రీశైలం జలాశయంలోకి వదిలినట్టు పిజెపి అధికారులు తెలిపారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా ఐదు యూనిట్ల నుంచి 18వేల 268 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది. జూరాల ప్రాజెక్టులు నీటమట్టం 318.516 అడుగులు ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 316.770 అడుగుల వద్ద కొనసాగుతోంది.

రేపు కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

- రైతులకు ఎస్‌కెఎం పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రైతులను, వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించిన కేంద్ర బడ్జెట్ ప్రతులను బుధవారం (జూలై 31న) దగ్ధం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) రైతులకు పిలుపునిచ్చింది. వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుందని తెలిపింది. రైతు వ్యతిరేకంగా ఉన్న ఈ బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేసింది. అందుకు నిరసనంగా కేంద్ర బడ్జెట్ ప్రతులను జిల్లా, మండల కేంద్రాల్లో దహనం చేయాలని కోరింది. ఈ మేరకు సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, పశ్యపద్మ, పి ప్రభాకర్, మండల వెంకన్న, మామిడాల భిక్షపతి, పద్దారపు రమేష్, జక్కుల వెంకటయ్య, కొండల్, ఆర్ వెంకట్ రాములు, ఎన్ బాల మల్లేశ్, వి రామకృష్ణ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చేందుకు ఈ బడ్జెట్ పూనుకోలేదని పేర్కొన్నారు. ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలో కోత పెట్టేందుకు పూనుకుందని తెలిపారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పంటల కొనుగోలుకు చట్టబద్దత కల్పించలేదని, ఎరువుల సబ్సిడీకి కోత విధించిందని విమర్శించారు. బడ్జెట్‌లో రుణమాఫీ ప్రస్తావనే తీసుకురాలేదని, సహకార రంగాన్ని బడా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార సబ్సిడీ, వడ్డీమాఫీకి, వ్యవసాయ పరిశోధనలకు, పెరిగిన బడ్జెట్‌కనుగుణంగా కూడా నిధులు పెంచలేదని తెలిపారు. వడ్డీమాఫీ పథకానికి (2022-23)లో రూ.23 వేల కోట్లు ఖర్చు చేస్తే, ఇప్పుడు రూ.22,600 కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. రీసెర్చ్ కోసం 2022-23లో రూ.1836 కోట్లు ఖర్చు చేస్తే, ఇప్పుడు రూ.1200 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. రీసెర్చ్ మొత్తాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల భీమా పథకంలో కూడా నిధులు కోత పెట్టారని విమర్శించారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకాన్ని భీమా కంపెనీలకు కాకుండా రైతాంగానికి ఉపయోగపడే విధంగా మార్చాలన్న రైతుల డిమాండ్ నెరవేర్చే ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. రైతులకు పింఛన్ ఇవ్వాలన్న డిమాండ్‌ను కూడా నెరవేర్చలేదనీ, ఉపాధిహామీ పథకానికి కోతలు పెట్టిందని విమర్శించారు.పాలమూరు, రంగారెడ్డితో సహా ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదనీ, తెలంగాణ రాష్ట్రం నుంచి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు, ఇక్కడి నుంచి ఎన్నికైన ఎనిమిది మంది పార్లమెంట్ సభ్యులు కేంద్రంపై ఒత్తిడి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆ సమాచారం కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి

- సిఎస్‌కు కెటిఆర్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు తెలంగాణ చరిత్రను, రాష్ట్ర ముఖ్య సమాచారాన్ని వెబ్‌సైట్లు, డిజిటల్ ప్లాట్ ఫామ్‌ల నుంచి తీసేస్తున్నదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కోరారు. గతంలో ఇదే అంశంపై సీఎస్‌కు లేఖక రాసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వెంటనే చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతో ప్రభుత్వం ఈ తొలగింపు చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వం తొలగించిన సమాచారమంతా తెలంగాణ చరిత్రలో అంతర్భాగమని తెలిపారు. ఈ చరిత్రను, ముఖ్యమైన సమాచారాన్ని అంతా భవిష్యత్ తరాలకు అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సింగరేణిని ప్రయివేటీకరిస్తే.. బతుకులు ఆగం

- కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో తీర్మానం పెట్టాలి
- ఇక్కడి వాటిపై దృష్టి పెట్టకుండా ఒడిశా గనులెందుకు?
- అన్ని పార్టీలూ కలిసి జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేద్దాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- బెల్లంపల్లిలో సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు కొంగు బంగారమైన సింగరేణి గనులను ప్రయివేటీకరిస్తే లక్షలాది మంది బతుకులు ఆగమవుతాయని, మన పిల్లల భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రయివేటు చేతుల్లోకి వెళ్తే వాళ్ల ఇష్టం వచ్చినట్టు దోపిడీ చేస్తారని, దేశానికి.. కార్మిక వర్గాలకే కాకుండా ఈ సంస్థపై ఆధారపడిన వారందరికీ తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో కోల్‌బెల్ట్ ఏరియాలో వారం రోజులపాటు సాగనున్న 'సింగరేణి పరిరక్షణ' బస్సు యాత్రను సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో తమ్మినేని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కొన్ని బొగ్గు బ్లాకులు అమ్మేశారని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం పెట్టారని అన్నారు. స్వయంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇద్దరూ కూర్చొని వేలంపాట పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి మాత్రం గనులను

ప్రయివేటీకరించడం లేదని చెబుతున్నారని, లోపల ఒకటి.. బయట ఒకటి మాట్లాడి కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తే బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. సింగరేణిలో 51శాతం వాటా రాష్ట్రానికి ఉంటే కేంద్రానికి 49శాతం ఉందని, అధిక వాటా కలిగిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే అమలు జరగాలని స్పష్టం చేశారు. సింగరేణిని కాపాడడంలో కాంగ్రెస్‌కు నిజంగా చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే అసెంబ్లీలో తీర్మానం పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అన్ని పార్టీలతో కలిసి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేద్దామని పిలుపునిచ్చారు. బలమైన పోరాటం చేయకపోతే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దిగిరాదని, ఒత్తిడి తీసుకొస్తేనే వెనక్కి తగ్గుతుందని అన్నారు. మరోపక్క సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో ఉన్న గనులపై దృష్టిపెట్టకుండా ఒడిశా వెళ్లి గనులను అప్పగించాలని కోరడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వైఖరి మార్చుకోవాలని, రాష్ట్రం గట్టిగా మాట్లాడితే కేంద్రం కూడా ఏమీ చేయలేదని అన్నారు. సింగరేణి పరిరక్షణకు ప్రజలు, కార్మికులంతా కలిసి పట్టువదలని పోరాటం చేయాలని, ఈ పోరాటంలో ఎర్రజెండా ఎళ్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.

రిజర్వేషన్లు అమలు కావు

సింగరేణిని పరిరక్షించుకోవడానికి కేంద్ర ప్రభుత్వానికి గట్టి నిరసన తెలపాలని తమ్మినేని స్పష్టం చేశారు. సింగరేణితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.వేల కోట్ల ఆదాయం వస్తోందని చెప్పారు. మొత్తం 900 కోట్ల టన్నుల బొగ్గులో ఇప్పటి వరకు 175కోట్ల టన్నులు మాత్రమే వెలికి తీశారని తెలిపారు. మిగతాది వెలికి తీయడానికి కనీసం 200 ఏళ్లు పడుతుందని అన్నారు. రాష్ట్రంలోని అపార ఖనిజ వనరులను ప్రయివేటుకు అప్పగిస్తే ధరలు పెరుగుతాయని, ఉద్యోగాలు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అనేవీ ఉండకుండా పోతాయని స్పష్టం చేశారు. ప్రజల జీవనాధారాన్ని పొట్టగొట్టే చర్యలను తీవ్రంగా ప్రతిఘటించాలని, ఈ పరిరక్షణ పోరాటంలో రాజకీయ, ప్రజాసంఘాలతో పాటు వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ.. సింగరేణి అనేక మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తోందని, తెలంగాణ వచ్చిన తర్వాత బొగ్గు బావులు కూడా లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేటుకు అప్పగిస్తే రాబోవు తరాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని అదానీకి కట్టబెట్టేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. బస్సు యాత్ర ప్రారంభంలో యాత్ర బృందం నాయకులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పైళ్ల ఆశయ్య, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మంద నర్సింహారావు, రాజారావు, నాగరాజు గోపాల్, సిపిఎం మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, నాయకులు అశోక్, ప్రకాష్, ముంజం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణేది?

- కబ్జాదారులతో రెవెన్యూ అధికారుల కుమ్మక్కు
- ప్రభుత్వ భూముల కబ్జాలపై స్థానికుల ఫిర్యాదు
- నిషేధిత జాబితాలో ఉన్నా రిజిస్ట్రేషన్లు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. 'చేను కంచే మేసిన' చందంగా అధికారులే కబ్జారాయుళ్లకు వత్తాసు పలుకుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే సర్కారు భూములను అప్పనంగా అక్రమార్కులకు అప్పగిస్తుండటంతో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు రెట్టింపు స్థాయిలో పెరగడంతో.. ఈ ప్రాంత భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. ఖాళీ స్థలం, ప్రభుత్వ జాగా.. ఎక్కడ కనిపిస్తే అక్కడ వ్యాపారులు వాలిపోతున్నారు. దీనికి రెవెన్యూ అధికారులు సైతం వంత పాడుతుండటంతో జిల్లాలో సర్కారు భూములు కనుమరుగవుతున్నాయి. ఉన్నతాధికారులు సైతం నిర్లక్ష్యంగా

వ్యవహరించడంతో ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం శంకరపురం గ్రామంలోని సర్వే నెంబర్ 24లో సుమారు 50 ఎకరాల లావాణీ పట్టా ప్రభుత్వ భూమి ఉంది. ఈ 24 సర్వే నెంబర్‌లోని 20 ఎకరాలకు సంబంధించి పది దళిత కుటుంబాలకు లావాణీ పట్టాలు ఉండటంతో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా, ఈ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. దాంతో తమ దగ్గర ఉన్న ప్రభుత్వ భూమి లావాణీ పట్టాలను ప్రభుత్వం తీసుకుంటుందని బెదిరించి నమ్మబలికి వారికి ఎంతో కొంత ఇచ్చి కొనుగోలు చేశారు. 20 ఎకరాల ప్రభుత్వ భూమికి యథేచ్ఛగా ప్రహరీ గోడ నిర్మించి ప్లాట్లు చేశారు. దానికి వెళ్లడానికి రోడ్డు కూడా ప్రభుత్వ భూమి నుంచి వేశారు. చుట్టుపక్కలున్న రైతులు తమ పొలాల నుంచి రోడ్డు వేయొద్దని వేడుకున్నా.. వారిని పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణం చేసి విద్యుత్ స్తంభాలు కూడా వేశారు.

ఇటీవల శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశారు. మండల పరిధిలోని శంకరపూర్ గ్రామానికి చెందిన చెన్నకేశవ కమలమ్మ, లక్ష్మయ్య దంపతులకు ఘాన్సిమియగూడ రెవెన్యూ పరిధిలో ఎనిమిదెకరాల భూమి ఉంది. వారికి గతంలో పాస్ పుస్తకాలు కూడా ఉండటంతో ధరణిలో నమోదు అయింది. 2023 నవంబర్ ఐదవ తేదీ వరకు ధరణిలోనూ వారి పేరు చూపించింది.. అనంతరం ఆరోవ తేదీన రెవెన్యూ అధికారులు తమ భూమి ధోరణిలో లేకుండా డిలీట్ చేశారని దంపతులు ఆరోపించారు. ఇలా రెవెన్యూ అధికారులే రియల్ ఎస్టేట్ వ్యాపారులతో అంటకాగుతుండ డంతో 'తమను అడిగే నాథుడే లేడు' అనే విధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నారు. గతంలో నిషేదిత జాబితాలో ఉన్న శంకరపురం భూములను రిజిస్ట్రేషన్లు చేయడంతో.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అడ్డు అదుపు లేకుండా పోయింది.

50 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన దళితులకు మరి కొంతమంది పేదవారికి లావాణి పట్టా సర్టిఫికెట్లు ఇచ్చిందని వాటిని వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నామని ఆ గ్రామ రైతులు తెలిపారు. కానీ కొన్ని రోజుల క్రితం కొందరు వచ్చి భూములు అమ్మకుంటే ప్రభుత్వం తిరిగి తీసుకుంటుందని బెదిరించారని రైతులు తెలిపారు. కాగా, వారికి ఎంతో కొంత డబ్బు ముట్టజెప్పి భూములను కబ్జా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు తెలిపారు. అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పినా ఏమాత్రం పట్టించుకోలేదని వాపోతున్నారు. ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేసి వెంచర్ చేస్తున్నారని వారిని అడిగితే, అధికారులతో, పోలీసులతో బెదిరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సామాన్యులు ప్రభుత్వ భూముల్లో గుడిసె వేసుకుంటేనే రెవెన్యూ అధికారులు వెళ్లి కూల్చివేస్తారు. కానీ కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమిస్తే అక్కడ కన్నెత్తైనా చూడకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈ నిబంధనలు పేదవారికేనా.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వర్తించవా.. అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నేడు రెండో విడత రైతు రుణమాఫీ

- రూ.లక్షన్నర రుణాలకు వర్తింపు
- అసెంబ్లీ ఆవరణలో ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు ఎంతో ఆతృతంగా ఎదురు చూస్తున్న రెండో విడత రుణమాఫీ నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రెండో విడతలో సుమారు ఏడు లక్షల మంది రైతులకు దాదాపు రూ.ఏడు వేల కోట్ల రుణాలను మాఫీ చేయనున్నారు. మొత్తం మూడు విడతల్లో రుణమాఫీని పూర్తి చేస్తామని సిఎం ప్రకటించిన సంగతి విదితమే. ఈ క్రమంలో ఈ నెల 18న మొదటి విడతలో 10,84,050 రైతు కుటుంబాలకు చెందిన 11,50,193 రుణ ఖాతాల్లో రూ.6,098.93 కోట్లను జమ చేశారు. మూడో విడతలో రూ. లక్షన్నర నుంచి రూ. రెండు లక్షల వరకు ఉన్న రుణాలను ఆగస్టు 15లోగా మాఫీ చేయా లని ప్రభుత్వం భావిస్తోంది.

పాస్‌బుక్ ప్రాతిపదికన రుణమాఫీ

రుణమాఫీకి రేషన్ కార్డ్ ప్రాతిపదిక కాదని, పాస్‌బుక్ నే కొలబద్దగా తీసుకొని అప్పులు మాఫీ చేశామని సర్కార్ తెలియజేసింది. ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం మొదటి విడత సందర్భంగా రుణాలను మాఫీ చేసినప్పటికీ, ఆధార్ నెంబర్, ఇతర వివరాలు సరిగా లేకపోవడం వంటి కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 17 వేల మందికి పైగా అర్హులకు డబ్బులు జమ కాలేదని సమాచారం. ఈ నేపథ్యంలో రుణమాఫీ ప్రక్రియలో సమస్యలు తలెత్తి డబ్బులు జమకాని రైతులనుంచి వ్యవసాయ శాఖ సంబంధిత ఫిర్యాదులు స్వీకరిస్తోంది.

'జిఎస్‌టి' అక్రమాలకు సహకరించిందెవరు?

- లోతుగా దర్యాప్తు చేస్తున్న సిసిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఎస్‌టి చెల్లింపుల్లో వెయ్యి కోట్లకు పైగా భారీ కుంభకోణం బైటపడటంతో వాణిజ్య పన్నుల శాఖతో పాటు ప్రభుత్వం అప్రమత్తమయింది. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకల కారణంగా ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన నిధులు దారిమళ్లడంపై ప్రధానంగా దృష్టి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తాజాగా వెలుగులోకి వచ్చిన జిఎస్‌టి కుంభకోణం పెద్ద సవాల్‌గా మారింది. సిఎస్ స్థాయిలో పనిచేసిన వ్యక్తే ఈ కుంభకోణంలో కీలకంగా ఉండటంతో ఐఎఎస్‌ల పనితీరుపై కూడా ప్రభుత్వ పెద్దలు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ఈ కుంభకోణంపై వాణిజ్య పన్నుల శాఖ అంతర్గతంగా విచారణ జరిపింది. ఆ నివేదికలను ఇటీవలే ప్రభుత్వానికి కూడా సమర్పించినట్లు తెలిసింది. జిఎస్టి కుంభకోణం..సిసిఎస్‌లో కేసు నమోదు వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆరా తీశారు. దర్యాప్తు సంస్థ కోరిన సమాచారం అందజేయాలని, ఈవ్యవహారంలో ప్రమేయమున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని సబంధిత అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత సిఎం దీనిపై పూర్తి స్థాయిలో సమీక్షించనున్నారు. జిఎస్‌టి కుంభకోణంలో సిసిఎస్ నిందితులుగా పేర్కొన్న వాణిజ్యపన్నుల శాఖ అడిషినల్ కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటి కమిషనర్ శివరామ ప్రసాద్, ఐఐటి హైదరాబాద్ అధ్యాపకులు శోభన్‌బాబు, ప్లియాంటో టెక్నాలజీస్ సంస్థ ఎండి, మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌లను సిసిఎస్ పోలీసులు త్వరలో అరెస్ట్ చేసే అవకాశం ఉంది. దీనిపై పోలీసు వర్గాలు అత్యంత గోప్యత ప్రదర్శిస్తున్నాయి. అయితే, ఇప్పటికే నిందితుల వద్ద నుంచి పోలీసులు ప్రాథమిక సమాచారం రాబట్టినట్టు తెలిసింది. పన్ను ఎగవేతదార్లకు వాణిజ్య పన్నుల శాఖలో ఉన్నతస్థాయి అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్న సమాచారంతో ఆశాఖ డేటాబేస్‌ను ఫోరెన్సిక్ తనిఖీ చేయాలని భావిస్తున్నారు.

మోటార్లకు మీటర్లు పెడితే తప్పేంటి?

- బిజెపి ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మోటార్లకు మీటర్లు పెడితే తప్పేంటని బిజెపి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట్రామిరెడ్డి ప్రశ్నించారు. సోమవారం శాసన సభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టాలని చెప్పటంలోని ఉద్దేశాన్ని కాంగ్రెస్ బీఆర్‌ఎస్ వక్రీకరిస్తున్నాయన్నారు. అవి పెట్టకపోవటం వల్లనే డిస్కంలకు నష్టాలొస్తున్నాయని చెప్పారు. ఉచిత కరెంటు ఇవ్వాలనుకుంటే ఆ మీటర్లు ఆటంకం కాదని చెప్పారు. రైతులకు విద్యుత్ పరికరాలు, అవసరాలు తీర్చటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు అవినీతిపై విమర్శలు చేసుకుంటున్నారనీ, అక్రమాలపై శాసన సభ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కారును ఢీ కొన్న ట్రక్కు.. ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ టవేరా కారును ట్రక్కు అతివేగంతో ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ దుర్ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని హుసేల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. హద్నూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన సిరాజోద్దీన్ (23), షాయిరా బేగం(40), ముఖీమ్, నయీమ్, శాహిదా బేగం, అమన్, షేక్ అబ్దున్, తబు బేగం.. హైదరాబాద్‌లోని బంధు వుల ఇంట్లో ఓ వేడుకకు హాజరై తిరిగి బీదర్‌కు టవేరా కారులో బయల్దేరారు. ఈ క్రమంలో న్యాల్కల్ మండలంలోని హుసేల్లి గ్రామ శివారుకు రాగానే.. బీదర్ నుంచి వస్తున్న ఓ ట్రక్కు అతివేగంగా వచ్చి టవేరాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టవేరాలో ఉన్న సిరాజోద్దీన్, షాయిరా బేగం అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారికి తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు బీదర్ ప్రభుత్వా స్పత్రికి తరలించారు.

భారీ విస్తరణపై యూనిటీ బ్యాంక్ దృష్టి

హైదరాబాద్ : యూనిటీ బ్యాంక్ భారీ విస్తరణపై దృష్టి కేంద్రీకరించింది. సోమవారం హైదరాబాద్‌లో కొత్తగా ఐదు శాఖలను యూనిటీ బ్యాంక్ సిఇఒ, ఎండి ఇందర్‌జిత్ కమోత్ర, ప్రెసిడెంట్ రంజన్ ఘోష్ లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం 9 రాష్ట్రాల్లో 182 శాఖలను కలిగి ఉన్నామన్నారు. వచ్చే 18 నెలల్లో వీటిని 300 శాఖలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ వ్యాపారంలో తెలుగు రాష్ట్రాల వాటా 30 శాతం వరకు ఉందన్నారు. త్వరలో విజయవాడ, విశాఖపట్నంలో కొత్తగా రెండు శాఖలను అందుబాటులోకి తేనున్నామన్నారు. మైక్రోఫైనాన్స్ రుణాల్లోకి అడుగుపెట్టనున్నామని తెలిపారు. అదే విధంగా వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు విభాగాలను ప్రవేశిస్తామన్నారు. వచ్చే సెప్టెంబర్‌లోనే బ్యాంక్ యాప్‌ను అందుబాటులోకి తేనున్నామన్నారు.

ఓలా ఎలక్ట్రిక్ ఇష్యూ ధరల శ్రేణి వెల్లడి

బెంగళూరు : ఓలా ఎలక్ట్రిక్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు సంబంధించి ధరల శ్రేణీని ప్రకటించింది. ఒక్కో షేరు ధరను రూ.72-76గా నిర్ణయించింది. ఈ ఇష్యూ ఆగస్టు 2న తెరుబడి 6న ముగియనుందని తెలిపింది. యాంకర్ మదుపర్లు ఆగస్టు 1న బిడ్లు దాఖలు చేసుకునే వీలుంది. ఈ ఇష్యూలో రూ.5,500 కోట్ల వరకు కొత్త షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 8.49 కోట్ల షేర్లను ప్రమోటర్లు, పెట్టుబడిదార్లు విక్రయించను న్నారు. మదుపర్లు గరిష్ఠ ధర వద్ద రూ.14,820తో కనీసం 195 షేర్లకు దర ఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐపిఒలో సమీకరించిన నిధుల్లో రూ.1,600 కోట్లు ఆర్‌అండ్‌డికి ఉపయోగిస్తామని..మరో రూ.800 కోట్లను రుణాల కింద చెల్లిస్తామని తెలిపింది. మిగిలిన నిధులను కార్పొరేట్ అవసరాలు, ఇతర కంపెనీ కొనుగోళు, విలీనాలకు ఉపయోగించనున్నట్లు పేర్కొంది.

కరోనిల్ పోస్టులను తొలగించాలి

- రాందేవ్ బాబాకు హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : కోవిడ్-19కు కరోనిల్‌ను నివారణగా ప్రచారం చేస్తున్న పోస్టింగ్‌లను తొలగించాలని బాబా రాందేవ్, పతంజలి గ్రూపునకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2021లో వివిధ వైద్యుల సంఘాలు వేసిన దావాలో భాగంగా దాఖలు చేసిన దరఖాస్తుకు ప్రతిస్పందనగా జస్టిస్ అనుప్ జైరామ్ భంభానీ సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా సోషల్ మీడియాలోని అభ్యంతరకరమైన పోస్ట్‌లు, కంటెంట్‌ను తొలగించాలని ఆదేశించారు. కరోనా మరణాలకు అలోపతి వైద్యులే బాధ్యత వహించాలని అప్పట్లో రాందేవ్ బాబా తీవ్ర ఆరోపణలు చేశారు. తన కరోనిల్‌ను మార్కెటింగ్ చేసుకోవడానికి వైద్య రంగంపై తప్పుడు ఆరోపణలకు పాల్పడ్డారు. కోవిడ్-19 నివారణకు కరోనిల్ మాత్రమే ప్రత్యామ్నాయమని రాందేవ్ నిరాధారమైన ప్రచారం చేస్తున్నారని వైద్యుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి.